


**మూ**ర్తి నిరుద్యోగి. అలా మూర్తిని నిరుద్యోగి అనటం కంటే మూర్తి మంచి కవి - కథా రచయిత అని చెప్పటం సబబుగా ఉంటుందేమో!

అయితే అతను ఇటు ఇంట్లోను, అటు బంధువర్గంలోను ఒక రచయితగా కంటే ఒక నిరుద్యోగిగానే ఎక్కువ గుర్తింపు పొందాడు. తనను ఎవరైనా, నిరుద్యోగి అని కామెంట్ చేస్తే అందుకు మూర్తి బాధపడడు. ఎందుకు బాధపడటం? తనొక్కడేనా నిరుద్యోగి. ఈ దేశంలో ఎందరో నిరుద్యోగులున్నారు. వాళ్లలో తను ఒక్కడు. అంతే!

అలా అని అతను ఉద్యోగ ప్రయత్నాలు మానుకోలేదు. తన శాయశక్తులా ప్రయత్నిస్తూనే ఉన్నాడు. ప్రతి ఇంటర్వ్యూకి క్రమం తప్పకుండా హాజరవుతూనే ఉన్నాడు. ఎంత ప్రయత్నించినా అతనికి ఉద్యోగం మాత్రం దొరకనే లేదు.

అతనికి ఉద్యోగం రాకపోవటానికి ఎన్నో కారణాలున్నాయి.

ఒకవైపు రికమండేషన్ క్యాండిడేట్‌ల పోరు, మరోవైపు లంచగొండి ఆఫీసర్‌ల జోరు.

మరి ప్రతిభకు అవకాశమెక్కడా?

ఆ కారణంగానే మూర్తి ఇప్పటివరకు నిరుద్యోగిగానే మిగిలిపోయాడు.

అతను ఇంటర్వ్యూకెళ్ళి వచ్చి ఆ ఉద్యోగం తనకు రాదు అని తెలిసిన ప్రతిసారి నిరాశనిస్పృహలకు లోనయ్యేవాడు. ఆ సమయంలో అక్షరాలే అతనికి ఓదార్పునిచ్చేవి. అక్షరాలే అతనికి ధైర్యం చెప్పేవి.

అక్షరాలే అతనికి బాహ్య ప్రపంచం నుంచి మరో ప్రపంచానికి తీసుకెళ్ళి ఊరట కలిగించేవి.

'నీకు తోడుగా మేమున్నాము' అంటూ అక్షరాలే అతనిని నవ్వించేవి, ఏడిపించేవి, క్రొత్త క్రొత్త ఆలోచనలు రేకెత్తించేవి.

అలా అక్షరరూపం దాల్చిన తన ఆలోచనల్ని చూసి మూర్తి పరమానందం పొందేవాడు. పరవశించిపోయేవాడు.

అందుకేకాబోలు మూర్తి అక్షరాలను నమ్మినంతగా ఈ ప్రపంచంలో మరొకరిని నమ్మలేకపోయేవాడు.

మనిషి అశాశ్వతం. ఆలోచన శాశ్వతం. అక్షరరూపం దాల్చిన ఆలోచన మరీ మరీ శాశ్వతం అని అతని అభిప్రాయం.

అవును మరి. అక్షరం ప్రపంచానికే కన్నులాంటిది కదా!

* * *

ఆ రోజు మూర్తి మరో ఇంటర్వ్యూకి హాజరయ్యాడు.

"మీ పేరు?" మూర్తికి ఇంటర్వ్యూ చేస్తున్న ముగ్గురు ఆఫీసర్‌లలో ఒక ఆఫీసర్ ప్రశ్నించాడు.

"మూర్తి" చెప్పాడు ఎంతో వినయంగా.

ఆ తర్వాత తన సర్టిఫికేట్స్ ఉన్న ఫైలు తీసి వాళ్ళ ముందుంచాడు.

ఆ ముగ్గురు ఆఫీసర్‌లలో మధ్య నున్న ఆఫీసర్ ఆ ఫైలు అందుకొని పేజీలు అటు ఇటు త్రిప్పుతూ "ఎక్స్‌ట్రా క్వాలిఫికేషన్స్ ఏవైనా ఉన్నాయా?" అని ప్రశ్నించాడు.

"కథలు.. కవితలు... వ్రాస్తుంటాను. 'కాంతి' కలం పేరుతో వివిధ పత్రికలలో నా కథలు అచ్చు అవుతుంటాయి".

ఆ మాటలకు ముగ్గురు ఆఫీసర్‌లు మొహమొహాలు చూసుకున్నారు. ఆ తర్వాత ఫక్కున నవ్వారు. నవ్వుతూనే ఒక ఆఫీసర్ అన్నారు.

"కథలు వ్రాస్తావా... ఏం కథలు? చందమామ కథలా?" మళ్ళీ ముగ్గురు అదో జోక్ అయినట్టు పెద్ద పెట్టున నవ్వారు.

మూర్తికైతే ఆ మాటలు ముళ్ళులా గుచ్చుకున్నాయి. అద్భుతమైన సాహిత్య ప్రపంచంలో అగ్రస్థానం వహించే కథల గురించి వాళ్ళంత తేలిగ్గా మాట్లాడుకోవటం చూసి ఆ కుర్రాడి కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

అంతకంటే ఈ ఉద్యోగం నీకివ్వనుపో అని కసురుకున్నా, మూర్తి అంతగా బాధపడేవాడు కాదు.

అప్పటికప్పుడు 'చందమామ కథలంటూ కథల గురించి ఎంత తేలిగ్గా మాట్లాడుతున్నావు! ఒక చందమామ కథ వ్రాసి చూడరా? కథంటే ఏమిటో.. ఆ కథ వ్రాయటంలో ఎంతటి కష్టం దాగి ఉంటుందో నీకే అర్థమవుతుంది అయినా కథంటే ఏమనుకుంటున్నావురా!

కథంటే జీవితం. నీ జీవితమే నీ కథరా మూర్ఖుడా!" అంటూ దులిపిపారేయాలనిపించింది. చిత్రంగా నోరు మెదిపితే కదా!

అతను కథను అవమానించాడు. అతనిని అవమానించే స్థితిలో లేనందుకు అతనికి తన మీద తనకే జాలేసింది.

ఈలోపు ఎదురుగా ఉన్న ఆఫీసర్‌లతో మధ్యనున్న ఆఫీసర్ అన్నారు.

"మిమ్మల్ని మూడు ప్రశ్నలు అడుగుతాము. సమాధానం చెప్పండి".

"సమాధానం చెప్పితే గ్యారంటీగా ఉద్యోగం ఇస్తారా? ఏం సార్! నా చదువు, నా మేధస్సు ఇవన్నీ కేవలం మీరు అడిగే మూడు ప్రశ్నల మీద ఆధారపడి ఉన్నాయా?"

ఒక్క క్షణం ఆగి మళ్ళీ అన్నాడు మూర్తి.

"ఏంసార్! మీరు అడిగిన మూడు - కేవలం మూడు ప్రశ్నలకు సమాధానం చెప్పినంత మాత్రాన నేను మేధావినవుతానా? అలాగే మీ మూడు ప్రశ్నలకు సమాధానం చెప్పలేకపోయినంత మాత్రాన నేను తెలివిహీనుడ్ని అవుతానా?"

"చూడు! నీ లాజిక్‌కు సమాధానం చెప్పాల్సినంత అవసరం మాకు లేదు.

ఇక్కడ ప్రశ్నలు అడగాల్సింది మేము. నువ్వు కాదు".

"సరే! మీ మూడు ప్రశ్నలకు నేను సమాధానం చెప్పగలను. మరి మీరు ఉద్యోగం ఇస్తారా?"

"నువ్వు చెప్పినట్టే ఈ ప్రశ్నలకు కొన్ని వందలమంది సమాధానం చెప్పగలరు. మరి మేము వాళ్ళందరికి ఉద్యోగాలు ఇవ్వలేము కదా?"

"నిజమే. నాలాగా కొన్ని వందల మంది చెప్పగలరు. ఆ చెప్పిన వాళ్ళలో భారీగా లంచాలు ముట్టచెప్పేవాళ్ళు ఉండవచ్చు. పెద్ద పెద్ద రికమండేషన్‌లతో వచ్చేవాళ్ళు ఉండవచ్చు.

"పాపం మీరు మాత్రం ఎవరికని ఇస్తారు ఉద్యోగాలు" అంటూ వ్యంగ్యంగా అని అక్కడ్నుంచి విసురుగా బయటకొచ్చాడు మూర్తి.

ఆరోజు రాత్రి మూర్తికి నిద్రపట్టలేదు. ఒకటే ఆలోచనలు, ఎడతెరిపిలేని ఆలోచనలు.

ఇక్కడ ఎవరిని నిందించాలో... ఎవరిని తప్పుపట్టాలో అతనికి అర్థం కాలేదు.

మొత్తం సమాజం అలా తయారయ్యింది. ఎవరిస్థాయిలో వాళ్ళు అవినీతికి పాల్పడటం సర్వ సాధారణమైపోయింది.

మూర్తి అసహనంగా తల విదిల్చాడు.

ఇప్పుడేమయ్యిందని?

తనకు ఉద్యోగం రాలేదు. తన బదులు మరో నిరుద్యోగికి ఉద్యోగం వచ్చి ఉండొచ్చు కదా?

పాపం ఆ ఉద్యోగం అతనికెంత అవసరమో! తను బ్రతకటానికి అక్షరాలు తనకు తోడుగా ఉన్నాయి. ఆ అక్షరాల్లో తనను తాను చూసుకొని తను ప్రశాంతంగా బ్రతగ్గలడు.

ఆ ఆలోచన రాగానే మూర్తికి నవ్వు వచ్చింది.

ఆ ఉద్యోగం తనకు రానందుకు తను నిరుద్యోగి గురించి ఆలోచిస్తున్నాను కాని, నిజంగా ఆ ఉద్యోగం తనకొచ్చి ఉంటే, తను మళ్ళీ నిరుద్యోగి గురించి ఆలోచించేవాడా? అప్పుడు కూడా తన ఆలోచనలు ఈరకంగా కొనసాగేవా?

ఉహు! ఎట్టి పరిస్థితులలోను తన ఆలోచనలు ఈరకంగా ఉండేవికావు.

ఉద్యోగంలో చేరటం గురించి, మొదటి జీతం అందుకోవటం గురించి కొన్నాళ్ళు పోయాక ఒక కథాసంపుటి అచ్చు వేయటం గురించి, ఆ రకంగా ఈ సమాజంలో ఒక రచయితగా గుర్తింపు పొందటం గురించి ఆలోచించేవాడు.

నిజంగా మనిషి ఆలోచనలను నియంత్రించేవి పరిస్థితులే కదా! పరిస్థితులనుబట్టి మనిషి ఆలోచనా విధానం మారుతూ ఉంటుంది.

ఇలా ఆలోచిస్తూ ఆలోచిస్తూ మూర్తి ఏ అర్థరాత్రికో గాఢ నిద్రలోకి జారుకున్నాడు.

అతని గుండెల మీద ఉన్న పుస్తకం ప్రారంభంలో ఇలా వ్రాసి ఉంది.

'మనిషి మేధస్సు కంటే ఆ మనిషికి ఎదురయ్యే పరిస్థితులు మరింత శక్తివంతమైనవే! ❋

